సాక్షి నిజామాబాద్

సోమవారం । 2 । జనవరి । 2023



పంచాయతీలపై భారం..
మిషన్ భగీరథ నీటి సరఫరాకు పన్నులు వసూలు చేయవద్దని ప్రభుత్వం ఆదేశించడంతో జీపీలపై భారం పడుతోంది.
- 8లో ▸



నేడు వైకుంఠ ఏకాదశి
ముక్కోటి ఏకాదశి వేడుకను సోమవారం జిల్లావ్యాప్తంగా భక్తులు జరుపుకోనున్నారు. ఆలయాలను ముస్తాబు చేశారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 33.4 /18.5
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'కొత్త సంవత్సరంలో మరింత ప్రగతి సాధిద్దాం'



కామారెడ్డి క్రైం: కొత్త సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత ప్రగతిని సాధించాలని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. మంత్రి ఆదివారం ఓ ప్రకటన లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణను మరింత సుసంపన్నం చేసేందుకు అన్ని వర్గాలు ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. ఆదివారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల

ఖలీల్‌వాడి : ఎస్సై, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలకు రాష్ట్ర పోలీస్ మండలి తేదీలను ఆదివారం ప్రకటించింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో డిసెంబర్ 20 న ఫిజికల్ టెస్ట్‌లు పూర్తి చేశారు. ఈ ఫిజికల్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ కోసం సంసిద్ధమవుతున్నారు. జిల్లాలో ప్రిలిమినరీ పరీక్ష 11,393 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించడంతో వీరికి ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ ఫిజికల్ టెస్ట్‌లను అభ్యర్థులు ఎక్కడైనా పాల్గొనే అవకాశం కల్పించారు. జిల్లాలో కొంతమంది అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉండే జిల్లాలో ఫిజికల్ టెస్ట్‌లో పాల్గొన్నట్లు తెలిసింది. ఈ ఫిజికల్ టెస్టుల్లో 5,298 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో మహిళలు 1,441 కాగా పురుషులు 3,857 మంది ఉత్తీర్ణత సాధించి ఎస్సై, కానిస్టేబుల్ మెయిన్స్‌కు అర్హత సాధించారు. అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ రాసేందుకు రాష్ట్ర పోలీస్ మండలి తేదీలను ప్రకటించింది. ఏప్రిల్ 9వ తేదీ ఎస్సై మెయిన్స్ పరీక్ష ఉండగా, ఏప్రిల్ 23వ తేదీ కానిస్టేబుల్ పరీక్షలకు నిర్ణయించారు. దీంతో అభ్యర్థులు నిజామాబాద్, హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్లకు వెళ్లి ప్రిపేర్ అవుతున్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



రుద్రూర్: చందూర్ మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ జగ్గరి శ్రీనివాస్ రెడ్డి పదవీ విరమణ చేసి, ఆదివారం స్వగ్రామానికి వచ్చాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు అతడికి ఘన స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

బర్త్‌డే పార్టీలో పాట లొల్లి..

- రౌడీ షీటర్ దారుణ హత్య
- కత్తులతో దాడి చేసి హతమార్చిన ప్రత్యర్థులు



ఇబ్రహీం (ఫైల్)

ఖలీల్‌వాడి: పుట్టిన రోజు వేడుకల్లో పాట పంచాయితీ ఒక రౌడీ షీటర్ ప్రాణాలు తీసింది. ఈ ఘటనలో నగరానికి చెందిన ఓ రౌడీ షీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఆరోటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సారంగాపూర్‌కు చెందిన హర్షద్ అనే వ్యక్తి తన బర్త్‌డే వేడుకలు ఆదివారం రాత్రి నెహ్రూనగర్‌లోని ఖాజాబేగ్ కట్టెల మండి వద్ద ఉన్న గ్రౌండ్‌లో నిర్వహించాడు. పార్టీకి డ్రైవర్స్ కాలనీకి చెందిన రౌడీషీటర్లు ఇబ్రహీం చావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు(29)తో పాటు ఆరిఫ్ (డాన్) ను హర్షద్ ఆహ్వానించాడు. వీరిద్దరు గతంలో స్నేహితులు. ఇద్దరూ కలిసి అక్రమ వ్యాపారాలు చేసేవారు. ఇటీవలి కాలంలో వీరిమధ్య భేదాభిప్రాయాలు రావడంతో వేర్వేరుగా గ్యాంగ్‌లను ఏర్పాటు చే సుకుని దందాలు చేస్తున్నారు.

అయితే ఆదివారం నిర్వహించిన బర్త్‌డే పార్టీకి వీరిద్దరు వచ్చారు. ఈ సమయంలో పార్టీలో ఆరిఫ్‌పై రాసిన పాటను ప్లే చేయడంతో ఇబ్రహీంకు నచ్చలేదు. దీంతో పార్టీ మధ్యలో నుంచి వెళ్లిపోతున్న ఇబ్రహీంకు ఎదురుగా ఆరీఫ్ రావడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచే సుకుంది. ఆరిఫ్‌పై ఇబ్రహీం దాడి చేసినట్లు తెలిసింది. గొడవ ముదరడంతో ఆరిఫ్ గ్యాంగ్ ఇబ్రహీంపై కత్తులతో దాడి చేసింది. తీవ్ర గాయాలపాలైన ఇబ్రహీంను ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆరోటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విల్లాసం

- అత్యాధునిక సౌకర్యాలతో 'రూర్బన్ నెస్ట్'
- 22 మంది వైద్యులు కలిసి విల్లాల నిర్మాణం
- స్విమ్మింగ్‌పూల్, థియేటర్, ఆటస్థలాలు సైతం..
- సోలార్ విద్యుత్ ఏర్పాటు, వర్షపు నీటి సద్వినియోగం..
- సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం
- డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ వద్ద నిర్మాణం



బర్ధిపూర్ శివారులో ఉన్న విల్లాలు

ప్రశాంతమైన వాతావరణం.. ఆహ్లాదకరమైన పరిసరాలు.. సకల సౌకర్యాలు.. ఆధునిక హంగుల కలబోతగా వైద్యులు నిర్మించుకుంటున్న విల్లాలు ఆకట్టుకుంటున్నాయి. కాలంతో పాటూ వచ్చిన మార్పులకు అనుగుణంగా తమ జీవనశైలిని కొనసాగించేందుకు వీటిని నిర్మించుకుంటున్నారు. కొందరు వైద్యులు కలిసి 'రూర్బన్ నెస్ట్' పేరిట చేపట్టిన 'నెట్ జీరో కమ్యూనిటీ ప్రాజెక్ట్' పలువురిని ఆకర్షిస్తోంది. డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ శివారులో 9.20 ఎకరాల్లో 22 మంది వైద్యులు కలిసి 22 విలాసవంతమైన డూప్లెక్స్ విల్లాలు నిర్మించుకుంటూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ఎస్‌టీపీ ప్లాంట్(మురుగునీటి శుద్ధి ప్లాంట్)



అన్నీ ప్రత్యేకమే..

'రూర్బన్ నెస్ట్' కమ్యూనిటీలో ఏర్పాటు చేసుకున్న సౌకర్యాలన్నీ ప్రత్యేకమే. విల్లాలకు చుట్టూ కమ్యూనిటీలో రెండువైపులా అటూ ఇటూ వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లు నిర్మించారు. ప్రతి విల్లాపై సోలార్ ఫలకాలు ఏర్పాటు చేశారు. ఇక విల్లాల మధ్యలో 2 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. మరోవైపు ఇంకుడు గుంతలు నిర్మించారు. అలాగే వర్షపు నీరు విల్లాలపై నుంచి నేరుగా సంప్‌లోకి వెళ్లేలా చేశారు. సంప్‌లో లక్ష లీటర్ల వర్షపు నీరు నిల్వ ఉండేలా ఏర్పాట్లు చేశారు. మురుగునీటి శుద్ధి కోసం ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నారు. వర్షపు నీటిని, శుద్ధి చేసిన మురుగు నీటిని ఈ సేంద్రియ వ్యవసాయానికి, వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లకు, చెట్లకు వాడుతున్నారు. ఇందులో డ్రిప్ ఇరిగేషన్‌తో కూరగాయలు, పూలు, పండ్లు, దుంపలు పండిస్తున్నారు. ఇక 30 ఆవులను పెంచేందుకు చక్కటి గోశాల నిర్మించారు.

విలాసవంతమైన అత్యాధునిక థియేటర్



సకల సౌకర్యాలతో..

కమ్యూనిటీలో విద్యుత్ లైన్లన్నింటినీ భూగర్భం నుంచి తీశారు. ప్రతి విల్లాలో ఉన్న స్నానపు గదుల్లో పగటి సమయంలో విద్యుత్ లైట్ల అవసరం లేకుండా సూర్యకాంతి వచ్చేలా ప్రత్యేకంగా వెంటిలేషన్ ఏర్పాట్లు చేశారు. ఇక తాగునీటి కోసం ప్రత్యేకంగా వాటర్ ప్లాంట్ ఉంది. పక్కనే బాతుల కోసం డక్ పాండ్ నిర్మించారు. అలాగే కిడ్స్ ప్లే ఏరియా, క్రికెట్, లాన్ టెన్నిస్ కోర్టులతో పాటు ఇండోర్‌లో బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్ ఉన్నాయి. ఇక క్లబ్ హౌస్‌లో ఫంక్షన్‌హాల్, అతిథుల కోసం సూట్ రూములు, జెంటిల్మెన్ రూం, మెడిటేషన్ రూం ఉన్నాయి. అదేవిధంగా క్లబ్ హౌస్‌లో వెజ్, నాన్‌వెజ్ కేఫ్స్ ఉన్నాయి. పక్కనే స్విమ్మింగ్ పూల్ నిర్మించి దీని చుట్టూ బయో పూల్ ఏర్పాటు చేశారు. ఈ బయో పూల్ నుంచి నీరు ఫిల్టరై ఫ్రెష్ ఎయిర్ వచ్చేలా ప్రత్యేకంగా ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇక 24 సీట్లతో అత్యాధునిక మినీ థియేటర్ ఏర్పాటు చేసి దీనికి ఇంటర్‌నెట్ లింక్ ఇచ్చారు. కాగా ఇక్కడ అన్ని విభాగాల నిర్వహణకు సంబంధించి వర్కర్ల కుటుంబాలకు ప్రత్యేకంగా 8 సింగిల్ బెడ్‌రూం క్వార్టర్లు నిర్మించారు.

విల్లాల మధ్య డ్రిప్ పద్ధతిలో సేంద్రియ వ్యవసాయం







గ్రామీణ వాతావరణంలో..



'నెట్ జీరో కమ్యూనిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇక్కడ ఉన్న వనరులనే వాడుకునేలా 'రూర్బన్ నెస్ట్' కమ్యూ నిటీకి రూపకల్పన చేశాం. 22 విల్లాలు ఒకేలా ఉండేలా నిర్మించాం. గ్రామీణ వాతావరణం నుంచి వచ్చిన మేం రూరల్ వాతావరణాన్ని ఆస్వాదించేలా ప్రాజెక్ట్ నిర్మాణం చేసుకున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్

స్విమ్మింగ్ పూల్



మరింత పురోగతి సాధించాలి



కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీపీ నాగరాజు, తదితరులు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- కొత్త కలెక్టరేట్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

సుభాష్‌నగర్ : నూతన సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ సి నారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం నగరశివారులోని కొత్త కలెక్టరేట్‌లో న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముందుగా న్యూ ఇయర్ కేక్ కట్ చేసి సంబురాలకు శ్రీకారం చుట్టారు. సీపీ కేఆర్ నాగరాజు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, ఆయా శాఖల అధికారులు, అనధికారులు ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తదితరులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ మాట్లాడు తూ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలు అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, ఆర్డీవో రాజేశ్వర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, అధికారులు జయ సుధ, శశికళ, రాములు, యోహాన్, మల్లారెడ్డి, రతన్, డాక్టర్ సుదర్శనం, నర్సయ్య, రాములు, తిరుమల ప్రసాద్, అదనపు డీసీపీ అరవింద్ బాబు, నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అలాగే టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్, రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం బాధ్యుడు రవీందర్, సీనియర్ సిటిజన్ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆఫీసర్స్ క్లబ్ కార్యవర్గం, ప్రముఖ వైద్యుడు ఆకుల విశాల్, ఈగ గంగారెడ్డి, బి.దేవిదాస్, భక్తవత్సలం కలెక్టర్‌ను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కలెక్టర్ విజ్ఞప్తికి స్పందన..

ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన వారు నోట్ పుస్తకాలు, దుప్పట్లు కలెక్టర్ నారాయణరెడ్డి స్వీకరించి, వాటిని సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అందజేశారు. పూల బొకేలకు బదులుగా పేద విద్యార్థులు సౌకర్యార్థం బ్లాంకెట్లు, నోట్ బుక్కులు తేవాలని కలెక్టర్ చేసిన విజ్ఞప్తికి అనూహ్య స్పందన లభించింది. వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాల్సిందిగా ఆదేశిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సంక్షేమ శాఖల అధికారులకు అందజేశారు.

స్వయం సమృద్ధికి బాటలు

మనోహరాబాద్‌లో పసుపు క్లస్టర్

- పరిశ్రమ స్థాపనకు ఏకమైన ఐదు గ్రామాల రైతులు
- 500 మందితో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు
- పసుపుతో వివిధ ఉత్పత్తులు తయారీ
- నేడు జిల్లాకు ఎన్ఐఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ గ్లోరి స్వరూప రాక



సంఘంగా ఏర్పడిన ఐదు గ్రామాల రైతులు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : రైతుల విప్లవాత్మకమైన ఆలోచనకు కేంద్ర ప్రభుత్వ రుణం రూపంలో సాయం అందింది. జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న పసుపు పరిశ్రమకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. పసుపుతో పలు రకాల ఉత్పత్తులు తయారు చేసి వ్యాపారం చేయాలన్న ఆలోచనకు 2021 జూన్‌లో బీజం పడింది. జక్రాన్‌పల్లి మండల పరిధిలో ఉన్న జక్రాన్‌పల్లి, మనోహరాబాద్, కలిగోట్, పడకల్ గ్రామాలే కాకుండా ధర్పల్లి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రైతులు ఈ ప్రాజెక్టులో షేర్ హోల్డర్లుగా ఉన్నారు. మొత్తం 500 మందితో పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని (జేఎంకేపీఎం) పేరుతో ఏర్పాటు చేసుకున్నారు. దీనికి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. సంఘానికి ఊరికి ఇద్దరు చొప్పున డైరెక్టర్లుగా ఉన్నారు. ఆర్థిక వనరుల కోసం రైతులు తలా కొంత డబ్బులు వేసుకున్నారు. అలాగే ఆత్మ నిర్బర్ భారత్ అభియాన్ పథకం క్రింద పసుపు పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోగా, కేంద్ర ప్రభుత్వం కొంత సబ్సిడీ ఇవ్వనుంది. మొత్తం రూ. 3 కోట్లు విలువ చేసే ఈ ప్రాజెక్టు ఏర్పాటు కోసం తొలి విడతగా రూ. 1.12 కోట్లు వచ్చాయి.

మార్కెటింగ్ మేమే చేస్తాం..

పసుపు క్లస్టర్ యూనిట్ ఏర్పాటైతే ఇక్కడి నుంచి చాలా రకాల ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేయనున్నారు. కార్పొరేట్ కంపెనీలు, వ్యాపారులే వచ్చి వీటి కొనుగోలుకు ఒప్పందం చేసుకోనున్నారు. పసుపును మూడు రకాలుగా విభజించి అందులోంచి కుర్క్‌మిన్ ఆయిల్, పౌడర్ తీస్తారు. పసుపు ఆకులతో కూడా నూనె తయారు చేస్తారు. ఫార్మా కంపెనీలకు కూడా ఔషధాలను సరఫరా చేయాలని రైతులు భావిస్తున్నారు. పసుపును వ్యాపారులు, దళారులకు అమ్మితే క్వింటాలుకు కేవలం ఐదారు వేలు మాత్రమే వచ్చేది.

రాష్ట్రంలో ఇదే మొదటిది..

ఏకంగా 500 మంది రైతులు సంఘంగా ఏర్పడి పసుపు ఉత్పత్తుల క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం రాష్ట్రంలోనే మొదటిసారని రైతులు పేర్కొంటున్నారు. అయితే, మనోహరాబాద్‌లో అర ఎకరంలో ఈ పరిశ్రమ భవనాన్ని నిర్మిస్తున్నారు. భూమిపూజ చేసి శంకుస్థాపన చేయడానికి జనవరి 2వ తేదీన జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రాజెక్టు (ఎన్ఐ ఎంఎస్ఎంఈ) డైరెక్టర్ జనరల్ ఎస్. గ్లోరీ స్వరూప జిల్లాకు రానున్నారు.

గట్టి సంకల్పంతో..



పసుపు అమ్మకాల్లో మధ్య దళారి వ్యవస్థ పోయి పసుపు విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయాలనేదే మాలక్ష్యం. ఒకటిన్నర సంవత్సరాలుగా పడిన కష్టానికి ఒక రూపం వచ్చింది. మనోహరబాద్‌లో నెలకొల్పే యూనిట్‌ను త్వరగా నిర్మించి 2024 నాటికి ప్రారంభించేలా చర్యలు చేపడుతాం. ముమ్మందు పరిశ్రమను మరింత అభివృద్ధి చేస్తాం.

– పాటుకూరి తిరుపతిరెడ్డి, సంఘం ముఖ్య డైరెక్టర్

యువతకు ఉద్యోగ ఉపాధి..



నెలకొల్పుతున్న పసుపు పరిశ్రమ రైతుల కోసమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి ఉపాధిని అందిస్తాం. చదువుకుని ఉద్యోగాల కోసం వేచి చూసే వారికి ప్రాధాన్యం ఇస్తాం. పసుపులో విలువ ఆధారిత ఉత్పత్తులను యంత్రాల ద్వారా తీసి మార్కెటింగ్ చేయనున్నాం. కా ర్పొరేట్, ఫార్మా కంపెనీలకు ఉత్పత్తులను సరఫరా చేస్తాం.

– గడ్డం శ్రీనివాస్ రెడ్డి, సంఘం డైరెక్టర్, మైలారం

దైవ నామస్మరణతో మోక్షం

- గణపతి సచ్చిదానంద స్వామి
- ఉత్తర తిరుపతికి తరలి వచ్చిన భక్తులు

నిజామాబాద్ కల్చరల్ : భగవంతుని నామస్మరణతో సకల శుభలాభాలు కలుగుతాయని మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. ఆదివారం నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకొని ఉత్తర తిరుపతి క్షేత్రంలో దత్త పాదుకా స్పర్శ, దత్త క్రియ యోగా ఉచిత శిక్షణ, నామార్చన, సంగీత సేవ తదితర ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ నామ సంకీర్తన నామస్మరణ ప్రాముఖ్యతను వివరించారు. సాయంత్రం సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాతో పాటు నిర్మల్, ఆదిలాబాద్, మెట్‌పల్లి, విజయవాడ, హైదరాబాద్, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.





ఉత్తర తిరుపతి క్షేత్రంలో పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, పాల్గొన్న భక్తులు



నీలకంఠేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సరి'కొత్త' ఆశలతో..

కోటి ఆశలు, సరికొత్త ఆలోచనలతో జిల్లావాసులు శనివారం అర్ధరాత్రి నూతన ఆంగ్ల సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. జిల్లావ్యాప్తంగా 2023 సంవత్సర సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్ద తేడా లేకుండా వేడుకల్లో పాల్గొన్నారు. యువత కేకులు కట్ చేసి కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం భక్తులు వివిధ ఆలయాల్లో పూజలు చేశారు.

క్లుప్తంగా

నేడు వైకుంఠ ఏకాదశి

● ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు



దోమకొండలో లక్ష్మీనారాయణస్వామి ఆలయం

కామారెడ్డి అర్బన్/ నిజామాబాద్ కల్చరల్: ముక్కోటి ఏకాదశి వేడుకలు సోమవారం భక్తులు జరుపుకోనున్నారు. జిల్లాలోని ఆలయాలు వైకుంఠ ఏకాదశికి ముస్తాబయ్యా యి. వైష్ణవాలయాలు ఉత్తరద్వారాలు నేడు తెరుచుకోనున్నాయి. ఈ ద్వారం వెంట వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటే పుణ్యప్రదమని భక్తులు భావిస్తుంటారు. నిజామాబాద్‌లోని జెండా బాలాజి మందిరం, ఆర్యనగర్ వేంకటేశ్వరాలయం, కోదండ రామాలయం, లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం, సుభాష్‌నగర్ రామాలయం, గంగాస్థాన్ ఉత్తర తిరుపతి, ఖిల్లా రఘునాథాలయం, కామారెడ్డి పట్టణంలోని పెద్దబజార్ శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీపంచముఖి హనుమాన్ శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి, వివేకానంద కాలనీలోని శ్రీకోదండ రామాంజనేయ స్వామి, దేవునిపల్లి శ్రీ రమ సత్యనారాయణ స్వామి, లింగాపూర్ శ్రీవేంకటేశ్వర స్వామి, అశోక్‌నగర్‌లోని శ్రీగోదాదేవి శ్రీరంగనాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజామున 5–30 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేసినట్లు ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు తెలిపారు.

దోమకొండ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ఉత్తర ద్వార దర్శనం కోసం మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి, సంఘమేశ్వర్‌లోని వేంకటేశ్వర ఆలయాలను ముస్తాబు చేశారు.

గోమాతకు అంత్యక్రియలు



మాచారెడ్డి: అనారోగ్యంతో మృతి చెందిన ఆవుకు రైతు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని చుక్కాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన జంగ ముత్యంపేట మల్లారెడ్డి ఏడాదిగా పెంచుకుంటున్న ఆవు అనారోగ్యానికి గురై చనిపోయింది. ఇన్ని రోజులు ప్రేమగా పెంచిన ఆవు చనిపోవడంతో అంత్యక్రియలు నిర్వహిస్తూ బోరున విలపించాడు.

జోరుగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరందుకుంది. శనివారం నాటికి 1.75 లక్షల టన్నులకు పైగా క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. క్రషింగ్ పూర్తి అయ్యే వరకు రైతులు సహకరించాలని కోరారు.

పంచాయతీలపై భారం

- 'భగీరథ' కుళాయి బిల్లు వసూలు చేయొద్దని ఆదేశం
- ట్యాంకులకు నీటిని సరఫరా చేసేంత వరకే భగీరథ సంస్థ బాధ్యత
- మిగతా పనులన్నీ చేపట్టాల్సింది జీపీలే..



వడ్యాట్ గ్రామ పంచాయతీ భవనం

మోర్తాడ్: ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిని సరఫరా చేస్తున్న ప్రభుత్వం ప్రజల నుంచి కుళాయి బిల్లులు వసూలు చేయొద్దని ఆదేశించింది. క్షేత్ర స్థాయిలో మాత్రం నీటి ట్యాంకుల నిర్వహణ, పైప్‌లైన్‌లకు లీకేజీలు ఏర్పడితే మరమ్మతులు ఇతర పనులకు పంచాయతీల ద్వారానే ఖర్చు పెట్టిస్తున్నారు. పంచాయతీలకు వచ్చే ఆదాయం రాకపోగా నీటి సరఫరా బాధ్యతలతో ఖర్చులు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని సర్పంచ్‌లు, కార్యదర్శులు వాపోతున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి కుళాయి బిల్లుల వసూళ్లు నిలిచిపోవడంతో జిల్లాలోని పంచాయతీలకు రూ.12 కోట్ల మేర ఆదాయం తగ్గిపోయింది. ఒక్కో కుళాయికి ఏడాదికి రూ.600 చొప్పున బిల్లు వసూలు చేసేవారు. ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో పంచాయతీలు ఇంటి పన్నుతో పాటు కుళాయి బిల్లు వసూలు చేసేవి. మిషన్ భగీరథ ద్వారానే ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తున్న నేపథ్యంలో కుళాయి బిల్లు వసూళ్లను ప్రభుత్వం నిలిపివేసింది. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, పంచాయతీల్లోని పరిస్థితికి తేడా ఉండటంతో పంచాయతీలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. కేవలం ట్యాంకులను నింపే వరకే మిషన్ భగీరథ సంస్థ బాధ్యత అని నీటిని విడుదల చేయడం, ట్యాంకుల నిర్వహణ, పైప్‌లైన్‌లకు లీకేజీలు ఏర్పడితే మరమ్మతులు పనులకు ఖర్చులు అన్ని పంచాయతీలే భరించాల్సి వస్తుందని సర్పంచ్‌లు చెబుతున్నారు. కొన్ని చోట్ల మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో పాత పంపుసెట్ల ద్వారా ట్యాంకులను నింపి నీటిని అందిస్తున్నారు. పేరుకే మిషన్ భగీరథ పథకం అమలులో ఉందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. జిల్లాలో పంచాయతీలకు ఇంటి పన్నుల ద్వారా ఆదాయం రూ.25 కోట్ల వరకు ఉండగా, కుళాయి బిల్లుల ద్వారా మరో రూ.12 కోట్ల ఆదాయం సమకూరేది. పంచాయతీల నిర్వహణ, మరమ్మతులు, ఉద్యోగుల జీతాలు మొత్తం ఈ ఆదాయం నుంచి ఖర్చు పెట్టేవారు. ఇప్పుడు కుళాయి బిల్లులు వసూలు చేయకపోవడం, నిర్వహణ, మరమ్మతుల భారం తగ్గకపోవడంతో పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం కుళాయి బిల్లుల వసూళ్లపై పునరాలోచన చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

బిల్లులు వసూలు చేయవద్దు

పంచాయతీలు కుళాయి బిల్లులు వసూలు చేయవద్దు. మిషన్ భగీరథ నీటిని విడుదల చేస్తుండటంతో పంచాయతీలకు కుళాయి బిల్లులు వసూలు చేయవద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.

– డాక్టర్ జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

నిజాంసాగర్‌లో న్యూ ఇయర్ సందడి

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఆదివారం న్యూ ఇయర్ సందడి నెలకొంది. కొత్త సంవత్సరం సందర్భంగా ప్రజలు కుటుంబ సభ్యులతో ప్రాజెక్ట్ తిలకించేందుకు వచ్చారు. గుల్‌గస్తా వద్ద టెంట్లు ఏర్పాటు చేసుకొని డీజే సాంగ్స్‌తో డ్యాన్సులు చేస్తూ అలరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాజెక్టు పరిసరాలు పర్యాటకులతో కిక్కిరిసింది. పలు పాఠశాలల విద్యార్థులు విహారయాత్ర కోసం ప్రాజెక్టుకు వచ్చి సందడి చేశారు.



ప్రాజెక్టుపై సుంకిని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



నిజాంసాగర్ ప్రాజెక్టు గుల్‌గస్తా వద్ద పర్యాటకులు

డ్రంకన్ డ్రైవ్‌లో 51 మందిపై కేసులు

కామారెడ్డి క్రైం: న్యూ ఇయర్ వేడుకల్లో శ్రుతి మించకూడదని జిల్లా పోలీసు శాఖ ముందుగానే హెచ్చరించింది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం రాత్రి పోలీసులు భారీగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయా డివిజన్‌ల పరిధిలో మొత్తం 51 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి డివిజన్ పరిధిలో 19, ఎల్లారెడ్డి పరిధిలో 15, బాన్సువాడ పరిధిలో 17 కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

ఆలయాల్లో విశేష పూజలు



కంఠేశ్వరాలయంలో భక్తుల సందడి

నిజామాబాద్ కల్చరల్: కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూతన ఏడాదిలో సుఖశాంతులతో ఉండాలని ప్రజలు పూజలు చేశారు. మాదవ్‌నగర్ సాయిబాబా ఆలయం, గంగాస్థాన్ ఫేస్–2 ఉత్తర తిరుపతి ఆశ్రమాలయం, నీలకంఠేశ్వరాలయం, శంబునిగుడి, జెండాబాలాజీ మందిరం, సుభాష్ నగర్ రామాలయం తదితర ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.









బోధనోపకరణాలతో పాఠాలు!

- తొలిమెట్టులో భాగంగా టీఎల్‌ఎం మేళాల నిర్వహణ
- మండల, జిల్లా స్థాయిలలో ఉపాధ్యాయులకు పోటీలు



వేల్పూర్ మండల కాంప్లెక్స్ సమావేశంలో టీఎల్‌ఎంను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

సిరికొండ: ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాలు కల్పించి, సులభంగా నేర్చుకోడానికి బోధనోపకరణాలు ఉపయోగపడతాయి. ఆగస్టు 15 నుంచి ప్రారంభించిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాథమిక పాఠశాలలో బోధన పరికరాలను ఉపయోగించి బోధన అభ్యసన ప్రక్రియలు కల్పించాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు టీఎల్‌ఎం(టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్స్) మేళాలు నిర్వహిస్తుంది. ఈ విధంగా తయారుచేసిన బోధన పరికరాలను ఆ మండల జిల్లా పరిధిలో అన్ని పాఠశాలల్లో వినియోగించుకునే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థులకు గుణాత్మక విద్య అందించవచ్చు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కనీస అభ్యాసన సామర్థ్యాలతో పాటు తరగతి అభ్యాసన ఫలితాలను కలిగించడానికి ఆగస్టు 15 నుంచి తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి నెల విద్యార్థులను మూల్యాంకనం చేస్తు ప్రగతి వివరాలు నమోదు చేస్తున్నారు. నిరంతర పరిశీలన పర్యవేక్షణ ద్వారా ఈ కార్యక్రమం అమలవుతోంది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాలు కలగడానికి బోధన పరికరాల వినియోగం తప్పనిసరి అని విద్యా శాఖ అధికారులు ఆదేశాలిచ్చారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయుల టీఎల్‌ఎం మేళాను నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో జనవరి 3న, జిల్లా స్థాయిలో జనవరి రెండో వారంలో, రాష్ట్ర స్థాయిలో సంక్రాంతి సెలవుల్లో మేళాలు నిర్వహించనున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ అభ్యసన అనుభవాలను విద్యార్థులకు కల్పించడానికి ఈ మేళాలను నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టు విషయానికి నాలుగు చొప్పున ప్రతి పాఠశాల నుంచి 16 బోధన ఉపకరణాలను ఉపాధ్యాయులు తయారు చేయనున్నారు. మండల స్థాయిలో ప్రదర్శన పూర్తయిన తరువాత పాఠశాల కాంప్లెక్స్ సహాయంతో అన్ని పాఠశాలలు ఈ బోధన ఉపకరణాలను వినియోగించుకుంటారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు ఇవ్వనున్నారు.

బోధనకు ఉపయుక్తం

ప్రస్తుతం జిల్లాలో ప్రాథమిక స్థాయిలో చాలా పాఠశాలల్లో ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయులతో బోధన సాగుతోంది. ఇటువంటి పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు చెప్పడం సాధ్యం కాని పని. కానీ బోధన పరికరాలు ఉంటే విద్యార్థులు స్వయంగా నేర్చుకుంటారు.

విద్యార్థులకు ప్రయోజనం

విద్యార్థులకు బోధన ఉపకరణాల సాయంతో బోధిస్తే ఎప్పటికి గుర్తుంచుకుంటారు. టీఎల్‌ఎం మేళాల ద్వారా తయారు చేసిన బోధన పరికరాలను అన్ని పాఠశాలలు వినియోగించుకుంటాయి. దీంతో విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుంది.

– నరేశ్, మండల రిసోర్స్ పర్సన్

అన్నదాతల్లో మార్పు

- రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్ తిప్పకుండా చర్యలు
- షిఫ్టింగ్ యంత్రాల సాయంతో తరలింపు
- భారమైనా సహకరిస్తున్న రైతులు



వెంచిర్యాల్‌లో షిఫ్టింగ్ యంత్రంపై తరలిస్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్

బాల్కొండ: వరి నాట్లు వేయాలంటే పొలాలను కేజీవీల్స్‌తో దమ్ము చేయాలి. కానీ కేజీవీల్స్‌తో ట్రాక్టర్‌లు ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లాలంటే రోడ్లపై తిరిగితే తారు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యేవి. ప్రస్తుతం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రోడ్లు ధ్వంసం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను హెచ్చరించారు. కేజీవీల్స్ రోడ్లపై తిరగడంతో వేసిన వెంటనే చెడిపోవడాన్ని మంత్రి స్వయంగా పరిశీలించారు. అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పోలీసులు ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గ్రామాల్లో రైతులకు, ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించారు. సొంత నియోజకవర్గంలోనే మార్పునకు శ్రీకారం చుట్టాలని మంత్రి నిశ్చయించడంతో అందుకు అనుగుణంగా రైతులు సహకరిస్తున్నారు. రోడ్లపై ట్రాక్టర్ కేజీవీల్స్ తిప్పకుండ షిఫ్టింగ్ యంత్రాలతో ఒక పొలం నుంచి మరో పొలంలోకి తరలిస్తున్నారు. దీంతో కేజీవీల్స్ ట్రాక్టర్ రోడ్డుపై తిరిగే అవసరం లేకుండా పోయింది. షిఫ్టింగ్ యంత్రాలకు దూరాన్ని బట్టి కిరాయి తీసుకుంటున్నారు. గ్రామానికి ఒక షిఫ్టింగ్ యంత్రం తయారు చేసుకునేలా ట్రాక్టర్ యజమానులు నిర్ణయించారు. కేజీవీల్స్ వీల్ పట్టీల కంటే షిఫ్టింగ్ యంత్రాలే బాగుంటాయని అంటున్నారు. రైతులకు షిఫ్టింగ్ కిరాయి భారమైన రోడ్ల ధ్వంసం కాకుండా అధికారులు చేపడుతున్న చర్యలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు.

మెట్లపై నుంచి జారిపడి మృత్యువాత

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన గుర్జాల మహేష్‌గౌడ్ (34) మూడు నెలలుగా కామారెడ్డిలోని విద్యానగర్‌లో నివాసం ఉంటూ ఓ కర్రీ పాయింట్‌లో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి కర్రీ పాయింట్‌లో కష్టమర్లకు పార్సిల్‌లను అందిస్తుండగా అక్కడున్న మెట్లపై నుంచి జారి కిందపడి తలకు తీవ్ర గాయమైంది. ఏరియా ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ నరేష్ తెలిపారు.

40 తులాల బంగారం చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని అంగడి బజార్ సమీపంలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీకి చెందిన బెంగాలీ అంజన్ ఇంట్లో బంగారు ఆభరణాలు తయారు చేస్తాడు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా విహార యాత్రకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంట్లో సామన్లు చిందరవందరంగా పడి ఉండటం చూసి ఆందోళనకు గురయ్యాడు. పని నిమిత్తం ఓ వ్యాపారి నుంచి 40 తులాల బంగారం తీసుకువచ్చాడు. కాగా ఆ బంగారం ఎత్తుకెళ్లారని బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



భూమయ్య (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని యానంపల్లి గ్రామానికి చెందిన గూండ్ల భూమయ్య మృతదేహం ఆదివారం దుబాయి నుంచి స్వగ్రామానికి చేరుకుంది. ఆర్థిక ఇబ్బందులతో దుబాయ్ వెళ్లిన భూమయ్య ఇటీవల తన గదిలోనే గుండెపోటు మృతిచెందాడు. కంపెనీ ప్రతినిధులు మృతదేహాన్ని హైదరాబాద్ వరకు పంపించారు. పేద కుటుంబం కావడంతో మృతదేహాన్ని ఎయిర్‌పోర్ట్ నుంచి తీసుకొచ్చేందుకు అంబులెన్స్ కోసం ధర్పల్లి, డిచ్‌పల్లి జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్యను విన్నవించారు. వారు స్పందించి ఎమ్మెల్సీ కవితతో ఫోన్లో మాట్లాడి జాగృతి తరఫున అంబులెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటుచేసి స్వగ్రామానికి తరలించారు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కేశాపూర్ చోరీ కేసులో చిక్కని దొంగలు



డబ్బులు ఎత్తుకుపోతున్న నిందితుడు (ఫైల్)

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్ గ్రామంలో డిసెంబర్ 21న జరిగిన చోరీ కేసులో దొంగల ఆచూకీ లభ్యం కాలేదు. దొంగలు పొరుగు రాష్ట్రం కర్ణాటకకు చెందిన వారై ఉంటారని భావించిన పోలీసులు అక్కడకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకుండా పోయింది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం మోపాల్ మండలం తాడెం గ్రామానికి చెందిన సూర్యరెడ్డి డిసెంబర్ 21న బ్యాంక్‌లో నుంచి రూ.13లక్షల 30వేలు డ్రా చేసుకుని తన కారులో పెట్టుకుని కేశాపూర్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. కారులోనే డబ్బుల కవర్ పెట్టి ఇంట్లోకి వెళ్లాడు. కారును బ్యాంక్‌నుంచి వెంబడించిన దొంగలు కారు అద్దాన్ని శబ్దం రాకుండా కట్ చేసి డబ్బులతో పారిపోయారు. దొంగలు నగదు దొంగలించి పారిపోయిన దృశ్యాలు సీసీ పుటేజీలో నమోదు కావటంతో దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మొదట దొంగలు మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన వారు భావించారు. కానీ దొంగలు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని గుర్తించిన పోలీసులు అయిదు రోజుల క్రితం ఎస్సై లింబాద్రితో కూడిన బృందం అక్కడకు వెళ్లింది. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. దొంగల ఆచూకీ లభ్యం కాక పోవటంతో తిరిగి శనివారం నిజామాబాద్‌కు చేరుకున్నారు. దొంగల ముఖచిత్రాలు సీసీ పుటేజీలో స్పష్టంగా నమోదు అయినా వారికి సంబంధించి ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు.

చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు



చెరువు వద్ద సంతోష్ వస్తువులు

సిరికొండ: చేపల వేటకు వెళ్లి ఒకరు గల్లంతైన ఘటన మండలంలోని మైలారం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కొండాపురం సంతోష్(45) కుర్దుల్‌పేట్ శివారులోని లక్ష్మి చెరువులో శనివారం చేపల వేటకు వెళ్లాడు. చెరువు వద్ద ఉన్న అతని దుస్తులు, చేపల వల, చెప్పులతో అతను చెరువులో చేపల వేటకు వెళ్లినట్లు తెలుస్తోంది. అతని ఆచూకీ తెలియకపోవడంతో భార్య అతని కోసం గాలించ సాగింది. చెరువు వైపు వెళ్లిన వారు అక్కడ ఉన్న వస్తువులను చూసి సంతోష్ చేపల వేటకు చెరువులోకి వెళ్లినట్లు చెబుతున్నారు. పోలీసులు స్థానికులచే చెరువులో ఆదివారం గాలించారు. సాయంత్రం వరకు గాలించిన సంతోష్ ఆచూకీ లభించలేదు.



చెరువులో గాలిస్తున్న గ్రామస్తులు

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి పెద్ద చెరువులో దూకి ఓ మహిళ ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కుర్రి అనసూయ (58) స్థానిక పెద్ద చెరువు కట్ట మీది నుంచి రాత్రి 9:30 గంటల ప్రాంతంలో వెళ్లింది. మహిళ రాత్రి పూట చెరువు కట్ట మీదికి ఎందుకు వెళ్తుందని ప్రత్యక్ష సాక్షులు అనుకుంటుండగానే చెరువులోకి దూకింది. దీన్ని చూసిన వారు వెంటనే చెరువులోకి దూకి అనసూయను ఒడ్డుకు తీసుకవచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామస్తులు భిక్కనూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహన్ని కామారెడ్డి ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. అనసూయ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఆమెకు పిల్లలు లేకపోవడంతో సమీప బంధువు కుమారుడిని దత్తత తీసుకున్నట్లు తెలిసింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాడ్వాయి: మండలంలోని చిట్యాల రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు.. తాడ్వాయికి చెందిన దొంతొల్ల భూమయ్య(45) తన సైకిల్‌పై తాడ్వాయి నుంచి చిట్యాల రోడ్డు మీదుగా వ్యవసాయ పొలం పనులకు వెళ్తున్నాడు. చిట్యాల గ్రామానికి చెందిన వడ్ల బ్రహ్మం బైక్‌పై చిట్యాల నుంచి తాడ్వాయికి వస్తుండగా ఎదురుగా వస్తున్న సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో భూమయ్య తలకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఇతర హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య సులోచన, కుమారుడు వినయ్ ఉన్నారు. మృతుడి తల్లి భీరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరు..

కామారెడ్డి క్రైం: కామారెడ్డికి సమీపంలో మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ నిజామాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సోన రవికుమార్ తన భార్య మహిత (30) నాలుగేళ్ల కుమారుడు రుషికేష్‌లతో కలిసి గత నెల 28న ఉదయం బైక్‌పై అత్తగారి గ్రామమైన బీబీపేటకు బయలుదేరాడు. కామారెడ్డికి సమీపంలోని ఇల్చిపూర్ వద్దకు రాగానే అజాగ్రత్త కారణంగా బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కాగా బాలునికి స్వల్ప గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం వారిని అదే రోజు నిజామాబాద్ హోప్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహిత ఆదివారం మృతి చెందినట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆమె భర్త, కుమారుడు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.